లక్ష్యం.. క్లీన్ ఏయూ

- జీవీఎంసీ తోడ్పాటు అవసరం
- వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక చొరవ


నాగార్జున వసతి గృహం వద్ద వ్యర్థాలతో నిండిన డస్ట్‌బిన్‌లు


ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన డస్ట్ బిన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు క్లీన్ ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో క్లీన్ ఏయూను సాకారం చేసే దిశగా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా విశ్వవిద్యాలయంలోని వందల ఎకరాల మైదానాలు, వ్యర్థాలతో నిండిన ఖాళీ స్థలాలను దాతల సహకారంతో శుభ్రం చేశారు. హాస్టళ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ఏయూ తన సొంత నిధుల నుంచి డస్ట్‌బిన్‌లను కొనుగోలు చేసి ఏర్పాటు చేసింది.

జీవీఎంసీ సిబ్బంది చొరవ చూపాలి

ఏయూలో పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపుపై జీవీఎంసీ సిబ్బంది శీతకన్ను వేస్తున్నారు. ఇక్కడ డస్ట్‌బిన్‌లలో వ్యర్థాలను తొలగించడానికి ఆసక్తి చూపడం లేదనే వాదన వినిపిస్తోంది. రోజుల తరబడి డస్ట్‌బిన్‌లు శుభ్రం చేయకపోవడం, వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలంటూ ఏయూకి సూచించడం జీవీఎంసీ సిబ్బంది నిరాసక్తికి అద్దం పడుతున్నాయి. ఏయూ సొంతంగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి, వ్యర్థాలను డస్ట్‌బిన్‌లలో వేసే విధంగా అంతర్గతంగా వ్యవస్థను, సిబ్బందిని ఏర్పాటు చేసుకుంది. కేవలం డస్ట్‌బిన్‌లలో వేసిన వ్యర్థాలను తొలగించడానికి జీవీఎంసీ కింది స్థాయి సిబ్బంది కుంటు సాకులు చెబుతున్నట్లు ఏయూ పారిశుధ్య విభాగం అధికారులు చెబుతున్నారు. నిత్యం డస్ట్‌బిన్‌లను శుభ్రం చేసే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

జీవీఎంసీకి ఏయూ భారీ సహాయం

జీవీఎంసీకి ఏయూ పలు సందర్భాల్లో భారీగా సాయం చేసింది. 2008లో సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా ఏయూకు చెందిన విలువైన స్థలాన్ని జీవీఎంసీ తీసుకుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఏయూలో భూగర్భ పారిశుధ్య వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పింది. కాల గమనంలో దీనిని గాలికొదిలేశారు. అదే విధంగా బీచ్‌రోడ్డులో వందల కోట్ల విలువైన స్థలాలను సైతం ఏయూ ఉచితంగా జీవీఎంసీకి అందించింది. వీటితో పాటు ప్రతి సంవత్సరం జీవీఎంసీకి పన్ను చెల్లిస్తోంది. ఇంత చేస్తున్నా ఏయూ కోరిన సమయంలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది స్పందించకుండా దాటవేత ధోరణి అవలంబించడం ఇబ్బందికరంగా మారింది.

కమిషనర్ ఏయూ విద్యార్థే..

ప్రస్తుత జీవీఎంసీ కమిషనర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి. ఏయూ ఆర్థిక పరిస్థితులు, ప్రస్తుతం ఏయూ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. పరిమిత వనరులు ఉన్నప్పటికీ ఏయూ విద్య, పరిశోధన, విస్తరణ, పరిశుభ్రత రంగాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి చేస్తున్న విధానం ఆయన ప్రత్యక్షంగా చూశారు. అదే విధంగా ప్రభుత్వం నిర్వహించిన ఇన్వెస్టర్స్ సమ్మిట్, జి–20 వంటి కార్యక్రమాలకు ఏయూ మైదానాలు, సమావేశ మందిరాలను వినియోగించడం, ఆ కార్యక్రమాలకు కమిషనర్ స్వయంగా హాజరు కావడం కూడా జరిగింది. ఏయూ పూర్వ విద్యార్థిగా, తనకు విద్యనందించిన ఏయూపై కమిషనర్ ప్రత్యేక చొరవ చూపుతూ పారిశుధ్య నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించాలని ఏయూ పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు కోరుకుంటున్నారు.

ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం


పోలమాంబకు పూజలు చేస్తున్న అర్చకుడు


ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్స కేంద్రం



ఆలయం బయట ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్


పోలీసులకు సూచనలిస్తున్న సీఐ కోరాడ రామారావు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో సురేష్‌బాబా తెలిపారు.

నేడు వార్షిక జాతర

పండగలో భాగంగా ప్రధాన ఘట్టం అనుపు మహోత్సవం, వార్షిక జాతర మంగళవారం జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని వివిధ రంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని ఇలవేల్పుగా కొలిచే పెదవాల్తేరు చుట్టుపక్కల 14 గ్రామాల ప్రజలు ఈ పండగకు తరలిరానున్నారు. పోలమాంబ ఆలయంలో పని చేస్తున్న 20 మంది సిబ్బందితో పాటు దేవదాయశాఖకు చెందిన సిబ్బంది 50 మంది వరకు ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచి నీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రాథమిక వైద్య శిబిరం, ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక, అదనపు కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత, రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంచారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు.

- పోలమాంబ పండగ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం అదనపు పోలీసు సిబ్బంది ఆలయం వద్దకు చేరుకుని భద్రత చర్యలో భాగమయ్యారు. మూడో పట్టణ సీఐ కోరాడ రామారావు సిబ్బందికి తగిన సూచనలు చేసి, విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాము, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'విద్యా హక్కు చట్టం' సౌత్ కౌన్సిల్ సభ్యుడిగా నరవ

మద్దిలపాలెం: విద్యా హక్కు చట్టం సౌత్ ఇండియన్ అలియన్స్ కౌన్సిల్ సభ్యుడిగా నగరానికి చెందిన నరవ ప్రకాశరావు నియామకమయ్యారు. సంస్థ సమావేశం ఈ నెల 2, 3 తేదీలలో బెంగళూరులో జరిగింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హాజరైన నరవను కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ పదవిలో మూడేళ్ల పాటు ఉంటానని నరవ తెలిపారు. విద్యా హక్కు చట్టం అమలుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నిర్వాహకుడు నిరంజన్ ఉపాధ్యాయ నుంచి తాను నియామక పత్రాన్ని అందుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కృష్ణా కళాశాలలో దంత వైద్య శిబిరం


అధ్యాపకులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్తంగా సోమవారం ప్రత్యేక దంత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. గీతం దంత వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని అధ్యాపకులు, విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత సంరక్షణ, దంత వ్యాధుల గురించి వైద్యులు సునీల్, మానస అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నభారతి, పి.ఉమామహేశ్వరరావు, సుధీర్, ఎన్‌సీసీ అధికారులు ఎస్.భగవాన్, నిఖిత, రెడ్ రిబ్బన్ క్లబ్ బృందం నివేదిత, రవిబాబు, లలిత, విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం సోమవారం స్థానిక గీతాంజలి కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. అసోసియేషన్ విధి విధానాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి అసోసియేషన్ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

సుందరంగా డంపింగ్ యార్డు ముఖద్వారం



హైవేని ఆనుకుని కాపులుప్పాడ డంపింగ్ యార్డు ముఖద్వారం వద్ద సుందరంగా ఆర్చి

మధురవాడ: నగరంలో నిర్వహించిన జి – 20 సదస్సు కారణంగా అన్ని ప్రాంతాలు సుందరంగా ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డు పరిసరాలు మరింత సుందరంగా తయారు చేశారు. జాతీయ రహదారి నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గాన్ని బీటీ రోడ్డుగా మార్చి ప్రవేశం వద్ద వేస్ట్ టు వెల్త్ కాంప్లెక్స్ అని ఏర్పాటు చేసిన ముఖ ద్వారం విశేషంగా ఆకట్టుకుంటోంది.

నైపుణ్యాలు పెంచుకోవాలి

కొమ్మాది: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని బ్రాండెక్స్ హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ కుప్పిలి శేషవర్ధన్ సూచించారు. రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ పీజీ, డిగ్రీ, ఇంజినీరింగు కళాశాలలో సోమవారం ప్రారంభమైన తరంగ్ 2కె23 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ చదువుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని, కృషి, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో హయింట్ గ్రిడ్ విన్స్టన్ ఎస్కే ఆడమ్స్, ప్రొఫెసర్లు దక్షిణామూర్తి, రాజగణపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంటీపీ కోసం 29 ప్రైవేటు ఆస్పత్రుల దరఖాస్తు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) సమావేశం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మొత్తం 29 ప్రైవేటు ఆస్పత్రులు ఎంటీపీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వాటిని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. గైనకాలజీ టీం సభ్యులు ఆయా ఆస్పత్రులను సందర్శించి ఎంటీపీకి సంబంధించి వైద్యుల అర్హతలు, పరికరాలు ఉన్నాయో? లేదో? పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. అనంతరం నివేదికపై చర్చించి అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కేజీహెచ్ గైనాలజిస్ట్ డాక్టర్ ఐ.వాణి, వుమన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, కేజీహెచ్ మత్తు డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసవాలపై సమావేశమై చర్చించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని తెలిపారు. లేదా ఈ–మెయిల్ ఐడీ endow-eokanaka@gov.in ద్వారా తెలుసుకోవచ్చు

ప్రమాదభరితంగా రక్షణ గోడ పనులు

- గృహాలపైకి జారి పడుతున్న బండ రాళ్లు
- భీతిల్లుతున్న దుర్గానగర్ గ్రామస్తులు


దుర్గానగర్ కొండపై కొనసాగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులు


కాలనీలోని నీళ్ల ట్యాంకుపైకి జారిపడిన బండ రాయి

మద్దిలపాలెం : సింహాచలం దేవస్థానం చేపట్టిన రక్షణ గోడ నిర్మాణ పనులు జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దేవస్థానం అధికారులతో మాట్లాడి రీసర్వే చేయాలని ఆదేశించినా రక్షణ గోడ నిర్మాణ పనులు చేపడుతున్నారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండ దిగువ వందల సంఖ్యలో నివాస గృహాలున్నాయి. ఈ గోడ నిర్మాణ పనుల కారణంగా కొండపై నుంచి పెద్ద బండ రాళ్లు ఇళ్లపైకి దూసుకు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒక బండ రాయి పడి వాటర్ ట్యాంకర్ ధ్వంసమైంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారి గిరిబాబు, స్థానిక నాయకులు సోమవారం దుర్గానగర్ కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను తాత్కాలికంగా నిలిపి వేయాలని ఆమె కోరారు. ఈ విషయాన్ని మంత్రి అమర్‌నాథ్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. ఇప్పటికైనా తక్షణమే రక్షణ గోడ నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఎమ్మెస్సీ నర్సింగ్ తరగతులు ప్రారంభం


జ్యోతి వెలిగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ ఎం.సత్యవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కె.విజయలక్ష్మి, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ సీహెచ్ సులోచన ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన


సాంబశివరావును సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఎస్.సాంబశివరావు అన్నారు. సోమవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి ఆయన విశిష్ట ప్రసంగం చేశారు. వార్తా పత్రికల్లో ఎడిటోరియల్ పేజీ ఎంతో ప్రధానమన్నారు. దీనిని చదవడం వల్ల విభిన్న అంశాలపై లోతైన అవగాహన ఏర్పడుతుందని, పోటీ పరీక్షల సమయంలో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. నిర్దిష్ట విధానాలు అమలు చేస్తూ సంక్షేమ పథకాలు అందరికీ అందించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధానం, అవకాశాలు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార జాలాది రవి, ఆచార్య పి.విశ్వనాథం, ఆచార్య జి.సుదర్శన్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును విభాగం తరఫున సత్కరించారు.

బీటెక్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్ష కేంద్రాలను ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న విధానం, ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై అధికారులను అభినందించారు. మొత్తం 1300 మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.పాల్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.

బంగారుమెట్టలో మందుబాబుల వీరంగం


కంఠంవారి వీధిలో కింద పడేసిన ద్విచక్ర వాహనాలు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు పరిధి బంగారుమెట్ట, కంఠంవారివీధి ప్రాంతాల్లో ఆదివారం అర్ధ రాత్రి దాటిన తరువాత మందుబాబులు వీరంగం సృష్టించారు. ముగ్గురు వ్యక్తులు బంగారుమెట్ట, శాఖా గ్రంథాలయం వద్ద నుంచి బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్ వరకు ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహనాలను కిందపడేస్తూ వెళ్లిపోయారు. ఆ శబ్దానికి నిద్రపోతున్న వారు లేచి వచ్చేసరికి మందుబాబులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో, వారు వచ్చి పరిసర ప్రాంతాల్లో గాలించారు. కానీ, మందుబాబుల ఆచూకీ తెలియలేదని తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా ఆకతాయిలు ఇదే ప్రాంతంలో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో పలు వాహనాలు దగ్ధం అయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిలు ఎక్కడెక్కడి నుంచో వచ్చి, తమ ప్రాంతంలో అలజడి సృష్టిస్తున్నారని వాపోతున్నారు. రాత్రి 9గంటలు దాటితే మహిళలు ఒంటరిగా బయటకు రాలేకపోతున్నారని తెలిపారు. పోలీసులు నైట్ బీట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సందడిగా 'పది' పరీక్షలు



తోటగరువు హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిండ్రుడులు

ఏయూ క్యాంపస్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తూర్పు నియోజకవర్గం పరిధి 20వ వార్డులోని కేడీపీఎం పాఠశాల కేంద్రంలో 238 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో 20 మంది దివ్యాంగులు ఉన్నారు. ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో 170 మంది విద్యార్థులకు 167 మంది పరీక్ష రాశారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థుల హాల్ టికెట్లను సిబ్బంది బయటే పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు.

పరీక్షల సందడి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పదో తరగతి పరీక్షల సందడి నెలకొంది. సోమవారం ప్రారంభమైన ఈ పరీక్షల కోసం ఆరిలోవ ప్రాంతంలో ఏడు పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలసి కేంద్రాలకు సమయం కంటే గంట ముందుగానే చేరుకున్నారు. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణాపురంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులం, ఆరిలోవలో భారతీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, విజేత స్కూల్, ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్, విశాలాక్షినగర్‌లో బీవీకే పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కోలాహలంగా మారింది. నిబంధనలు ప్రకారం ఉదయం 8.45 గంటలకు విద్యార్థులను పోలీసులు తనిఖీలు చేసి, పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. బోర్డులపై రాసి ఉన్న హాల్ టికెట్ నంబర్లు, రూం నంబర్లు విద్యార్థులు ముందుగా చూసుకుని లోపలికి వెళ్లారు. కేంద్రాల వద్ద జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు వాటర్ క్యాన్‌లు ఏర్పాటు చేశారు. ఆరిలోవ పోలీసులు, సచివాలయాల కానిస్టేబుళ్లు కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలాంటి పుస్తకాలు లోపలకు తీసుకెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ఆరిలోవలో జీవీఎంసీ ఆస్పత్రి వైద్య సిబ్బంది ప్రత్యేక ప్రాథమిక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



కేడీపీఎం పాఠశాల వద్ద విద్యార్థుల సందడి


తోటగరువు హైస్కూల్ వద్ద బోర్డుపై రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

'ప్రధాని మోదీవి ప్రజా వ్యతిరేక విధానాలు'


జగదాంబ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని సీపీఎం నాయకులు విమర్శించారు. చివరకు శవాలపై కాసులు ఏరుకునే స్థాయికి మోదీ సర్కారు దిగజారిపోయిందని విరుచుకుపడ్డారు. శవాలపై జీఎస్టీ విధించడం సిగ్గుచేటంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం జగదాంబ జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. యల్లమ్మతోటలోని సీపీఎం కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్, వైఎస్సార్ విగ్రహ కూడలి, లేపాక్షి జంక్షన్ మీదుగా తిరిగి జగదాంబ కూడలి వరకు ఈ ప్రదర్శన సాగింది. మోదీజీ అచ్చేదిన్ అంటే ఇదేనా? బాబోయ్ మోదీ నిలువు దోపిడీ, టోల్‌గేట్‌పై 7 శాతం, ఫోన్‌పే, గూగుల్‌పే పై రూ.2 వేలుకు రూ.20, రూ.2 వేలు మందుల కొనుగోలుపై 12 శాతం, వంటగ్యాస్ ధర రూ.1,150 అంటూ ప్రజావ్యతిరేక విధానాలపై పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అనేక రకాలుగా పన్నులు విధిస్తూ దేశ ప్రజలపై అదనపు భారం మోపడం దారుణమన్నారు. లక్షల కోట్లు పెట్రోల్, డీజిల్, కిరోసిన్ ద్వారా వస్తున్నా.. రోడ్ల అభివృద్ధికంటూ టోల్‌గేట్ రేట్లు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా మోదీని ఇటు వైఎస్సార్ సీపీ గానీ, ప్రతిపక్ష తెలుగుదేశం, పవన్‌కల్యాణ్ నిలదీయకపోవడం విచారకరమన్నారు.

బైబై బేబీ రిడ్లేస్


ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచి పెడుతున్న కార్పొరేటర్ కొండబాబు, తదితరులు

కొమ్మాది: అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. వాటి గుడ్లను సేకరించి, ప్రత్యేకంగా పొదిగించి పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టిన అద్భుత దృశ్యం సోమవారం ఆవిష్కృతమయ్యింది. బుల్లిబుల్లి తాబేళ్ల బుడిబుడి అడుగులు వేసుకుంటూ సాగరం వైపు సాగే దృశ్యాలు ప్రతి ఒక్కరికీ కనువిందు చేశాయి. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ తీరంలో 550 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, అటవీశాఖ అధికారులు సముద్రంలోకి విడిచిపెట్టారు. పర్యావరణ ప్రేమికులు ఈ దృశ్యాన్ని చూసి పరవశించిపోయారు. బైబై బేబీ రిడ్లేస్ అంటూ తాబేళ్లకు వీడ్కోలు పలికారు.